నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

◆ చంపాపేట, సుల్తానాఅల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సాయిరాంనగర్, శ్రీకర ఎన్‌క్లేవ్, పటేల్‌నగర్, నాగార్జున, రాఘవేంద్ర, చంపాపేట విలేజ్, సుల్తానాఅల్వా, పోచమ్మగడ్డ, మారుతీనగర్, బృందావన్, బాలాజీనగర్, ఎస్‌జీఆర్, రాజిరెడ్డినగర్, వైశాలీనగర్, ఆర్‌టీసీ, భానునగర్, కేశవనగర్, సింగరేణి, ఎస్ఎస్‌రెడ్డి నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

◆ అలాగే గ్రీన్‌పార్క్, శ్రీనివాసనగర్, శ్రీరాంనగర్, ప్రెస్ కాలనీ, పవన్‌పురి, పద్మానగర్, అంజిరెడ్డినగర్, నిర్మలానగర్, క్రాంతినగర్, మైత్రిపురం, సామ సరస్వతీనగర్, ఉదయ్‌నగర్, కర్మన్‌ఘాట్ పాత బస్తీ, శ్రీనిధి, లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో...

సైదాబాద్: ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

◆ ఉదయం9 నుంచి 11 గంటల వరకు...

డాన్ స్కూల్, బీబీ క్యాన్సర్ హాస్పిటల్, రాజ్‌దర్బార్, జియా కా హోటల్, ఇబ్రహీం ఫంక్షన్‌హాల్, మౌలీ కా మాస్క్, బాబూ మియా గిర్నీ పరిసర ప్రాంతాలు.

◆ ఉ. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

ఏసీపీ ఆఫీస్, సైదాబాద్ మెయిన్ రోడ్, అమీన్ కాలనీ, జాకీర్ హుస్సేన్ కాలనీ పరిసర ప్రాంతాలు.

◆ మ. 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు...

అక్బర్‌బాగ్, పల్టన్ చౌరస్తా, దయానంద్ నగర్, ఆనంద్‌నగర్, మలక్‌పేట పరిసర ప్రాంతాలు.

◆ సా. 4 నుంచి 6 గంటల వరకు...

వాణి కాలేజీ, కిడ్నీ హాస్పిటల్, నల్గొండ క్రాస్ రోడ్స్, సొహైల్ హోటల్ పరిసర ప్రాంతాలు.

కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా పుల్లయ్య


నియామక పత్రం అందుకుంటున్న పుల్లయ్య

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఆలూరి పుల్లయ్యను నియమించారు. ఈ మేరకు టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి మంగళవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి, నాయకులు కొంగరి నర్సింహారావు, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ అడ్వైజర్‌గా ప్రొ.క్యారోలిన్



మలక్‌పేట: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ నేషనల్ అడ్వైజర్ (విద్యా విభాగం)గా ప్రొఫెసర్ డాక్టర్ వీజేఈ క్యారోలిన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండీ ముజాహిద్ ఉత్తర్వులు జారీ చేశారు. మానవ, విద్యా హక్కుల పరిరక్షణ కోసం క్యారోలిన్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రొఫెసర్‌గా రెండు దశాబ్దాల అనుభవంతో తన బాధ్యతను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. 'లైఫ్ ఫౌండేషన్' ఎన్‌జీఓ ద్వారా నగరంలోని మురికివాడల్లోని పిల్లల చదువుకు తాను కృషి చేస్తున్నానని తెలిపారు.

విద్యావేత్త షరీఫ్‌కు జీవిత సాఫల్య పురస్కారం


దుబాయ్‌లో అవార్డు అందుకుంటున్న షరీఫ్

వనస్థలిపురం: ప్రముఖ విద్యావేత్త, కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్, రెయిన్‌బో స్కూల్స్ చైర్మన్ ఎంఎం షరీఫ్ 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు. విద్యారంగాభివృద్ధికి మూడు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషి గుర్తింపుగా జనవరి 20న దుబాయ్‌లో జరిగిన మిడిల్ ఈస్ట్ ఏషియా లీడర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. షరీఫ్‌కు అవార్డు రావడంపై విద్యారంగ ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

షణ్ముఖ కుటుంబానికి హరియాణా గవర్నర్ పరామర్శ


పరామర్శిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

చైతన్యపురి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామోజు షణ్ముఖ (జన్నన్న) కుటుంబ సభ్యులను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం పరామర్శించారు. చైతన్యపురి ప్రభాత్‌నగర్‌లోని షణ్ముఖ నివాసానికి వెళ్లి సతీమణి శోభారాణి, కూతురు తేజస్విలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న ఆయన మృతి తీరని పార్టీకి తీరని లోటని అన్నారు. కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'ను వినియోగించుకోవాలి

నాగోలు: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పథకాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ కోరారు. దేశంలోని పేదల కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్‌ను మంగళవారం బండ్లగూడలో ఆమె విడుదల చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, వీటికి ఎవరు అర్హులు అనే పూర్తి సమాచారాన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు వివరంగా చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. నాయకులు చంద్రశేఖర్ గుప్తా, పద్మ రెడ్డి, రాధిక,మనోజ్ కుమార్ సంగారెడ్డి, యాదగిరి, రాము గౌడ్, మనోజ్, అమర్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్పొరేటర్ అరుణ తదితరులు

మార్నింగ్ వాక్‌తో ప్రజా సమస్యల పరిష్కారం

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- ఈ కార్యక్రమం ప్రారంభించి 36 ఏళ్లు పూర్తి


మార్నింగ్ వాక్‌కు వచ్చిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు, నాయకులు

మన్సూరాబాద్: మార్నింగ్ వాక్ చేపట్టి ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి హకీమాబాద్, ఆగమయ్యనగర్ కాలనీల్లో ఎమ్మెల్యే మంగళవారం మార్నింగ్ వాక్ చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, 1987 జనవరి 23న అక్బర్‌బాగ్ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో మార్నింగ్ వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని, నేటికి 36 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. నాడు ఆంధ్రా కాలనీవాసులు మంచినీటి సరఫరా జరగడం లేదని, లోప్రెషర్‌తో వస్తుందనే ఫిర్యాదుల మేరకు మార్నింగ్ వాక్ చేపట్టినట్లు వివరించారు. నాటి నుంచి నేటి వరకు మార్నింగ్ వాక్‌ను నిరంతరంగా చేపడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతున్నానని చెప్పారు. ఆగమయ్యనగర్ కాలనీలో వరదనీరు, డ్రైనేజీ మురుగు కలిసి కాలనీలో ప్రవహిస్తోందని, నిత్యం డ్రైనేజీ మురుగు రోడ్లపై పొంగిపార్లుతోందని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో కాలనీలో పర్యటించానని ఎమ్మెల్యే తెలిపారు. సమస్య పరిష్కారం కోసం వరద నీటికి ప్రత్యేక లైన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నియోజవర్గాన్ని అభివృద్ధిపథంలో ముందుంచుతానని స్పష్టంచేశారు.

'సూర్యుడి కన్నా ముందు సుధీరన్న'..

గత 36 ఏళ్ల క్రితం ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్నింగ్ వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, 'సూర్యుడి కన్నా ముందే మన సుధీరన్న' అనే నినాదంతో కాలనీల్లో పర్యటిస్తున్నారని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి అన్నారు. నాడు కార్పొరేటర్‌గా మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించి... నేటికీ నిర్విరామంగా కొనసాగిస్తూ ఎన్నో సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, రుద్రయాదగిరి, జక్కిడి రఘువీర్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, రవిచారి, అఖిల్, ఆంజనేయులు, సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 40, బీర 45, క్యాబేజ 19, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 21–23, చిక్కుడు 23–28, గోకర 53, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 18–23, దోస 25, సొర 9, ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సమస్యల పరిష్కా రం కోసం బుధవారం హయత్‌నగర్‌లోని అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ కార్యాలయం(ఆటోనగర్) వద్ద వినియోగదారుల గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు డీఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, కన్జూమర్ అఫైర్స్ హాజరవుతారని వినియోగదారులు దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందగలరని సూచించారు. ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్నం 1 గంటల వరకు సమావేశం నిర్వహించనున్నారు.

గురుకుల విద్య, సదుపాయాలపై ప్రచారం


చావణీలో ప్రచారం చేస్తున్న సిబ్బంది

చంచల్‌గూడ: చావణీలో తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశం తీసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కె. విద్యాసాగర్ కోరారు. ఈ మేరకు మంగళవారం చంచల్‌గూడ, చావణీ ప్రాంతాల్లో పాఠశాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య తదితర అంశాలకు సంబంధించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో 30 మైనార్టీ సీట్లు, 10 నాన్ మైనార్టీ సీట్లు, 6వ తరగతిలో 7 మైనార్టీ సీట్లు, 7, 8 తరగతుల్లో ఒక సీటు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మైనార్టీ గురుకుల వెబ్‌సైట్‌లో లేదా.. స్వయంగా పాఠశాలకు వచ్చి సమర్పించవచ్చని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ మునీర్, ఆర్కే రెడ్డి, వార్డెన్ హకీం, ఉపాధ్యాయుడు సలావుద్దీన్, సిబ్బంది తఖీ, గౌసుద్దీన్ తదితరులున్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి



హస్తినాపురం: రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం నివారణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి పెద్ద చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి నవీన్‌కుమార్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ధాతు నగర్ కాలనీలోని ఆలయం ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటారు.

మర్యాదపూర్వక కలయిక



మలక్‌పేట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ మంగళవారం పార్టీ నాయకులతో కలిసి గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో నాయకులు మహేష్, విజయ్, భాస్కర్, సూర్యకాంత్, శివ, బషీర్‌ఖాన్, మెట్టు సాయి తదితరులు ఉన్నారు.

రజక వృత్తిదారుల సమాఖ్య కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ టీఆర్ఎస్ నాయకుడు అనంతుల రాజిరెడ్డి, రజక సంఘం నాయకుడు దండు నిరంజన్, లక్ష్మణ్, మహేందర్, శ్రీరాములు, మల్లేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతపై అవగాహన అవసరం


నాగోలులో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ సురేష్‌రెడ్డి

నాగోలు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలని నాగోలు ఆర్టీఓ సురేష్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగోలు ఆర్టీఓ కార్యక్రమంలో పలువురు భారీ వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాల్సిన ఆవశ్యకతపై ఆర్టీఓ వివరించారు. మద్యం తాగి వాహనలను నడపవద్దని డ్రైవర్లకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాగోలు ఎంవీఐలు, సిబ్బంది, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నాగోలు: యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ పార్టీ నాగోలు డివిజన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శిల్పారెడ్డి, జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి అన్నారు. మంగళవారం జైపురికాలనీ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లి గ్రౌండ్‌లో జేపీసీ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నీ నిర్వహించారు. శిల్పారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాలనీ ప్రధాన కార్యదర్శి రాహుల్ పోతాని, నాగోలు నాయకులు గుమ్మడి వెంకట్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్, జాయింట్ సెక్రటరీ కస్తూరి అశోక్, కోయల్‌కార్ యాదిలాల్, రవి కులకర్ణి పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీని ప్రారంభోత్సవంలో పాల్గొన్న శిల్పారెడ్డి తదితరులు

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి

మహేశ్వరం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతానాయక్ పేర్కొన్నారు. మంగళవా రం మండల పరిధిలోని నాగుల్‌దోని తండాల్లో ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆడ పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు.

మలక్‌పేటలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేద్దాం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అక్బర్


కార్యకర్తల నుద్దేశించి మాట్లాడుతున్న షేక్ అక్బర్

మలక్‌పేట: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ అన్నారు. మంగళవారం మూసారంబాగ్ రజక సంఘం భవనంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో షేక్ అక్బర్ మాట్లాడుతూ, కార్యకర్తల సమష్టి కృషితోనే 30 వేల ఓట్లు సాధించామన్నారు. ఓటమితో ఎవరూ కృంగిపోవద్దని, నైతికంగా గెలుపు కాంగ్రెస్‌దేనని అన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు అశ్వక్‌ఖాన్, ఏవీఎస్‌రెడ్డి, మదన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమన్న విభేదాలు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. కానీ మలక్‌పేటలో ఆపార్టీ నాయకులు గ్రూప్‌లుగా విడిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారింది. గత పదేళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో కనిపించని నాయకులు సైతం పెత్తనం కోసం పోటీ పడుతున్నారని ఆపార్టీ కార్యకర్తలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి షేక్ అక్బర్‌కు మలక్‌పేట సీటు కేటాయించగా.. సీనియర్ నేతలు వ్యతిరేకించారు. అయితే అక్బర్ వారిని ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ కోసం పని చేసేలా సమన్వయం చేశారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, కొత్తగా పార్టీలో చేరిన నాయకులు ఎన్నికల్లో పని చేశారు. ఇది ఇలా ఉండగా.. మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ గ్రూప్ విభేదాలు బహిర్గతం అయ్యాయి. సీనియర్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు సమావేశానికి డుమ్మా కొట్టారు. పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఒంటెద్దు పోకడలు అవలంభిస్తున్నాడని వారు మండిపడుతున్నారు. పార్టీకి సంబంధించిన ఏ విషయంలోనూ తమను సంప్రదించడం లేదని, కొత్తగా పార్టీలో చేరిన వారిని పక్కన పెట్టుకుని సీనియర్ నాయకులను విస్మరిస్తున్నాడని డివిజన్ల అధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమష్టి నిర్ణయాలు తీసుకోకుండా ఏర్పాటు చేసిన సమావేశాన్ని బహిష్కరించినట్లు డివిజన్ల అధ్యక్షులు తెలిపారు.

కేంద్ర పథకాలపై అవగాహనకే 'వికసిత్ భారత్ యాత్ర'

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని భానునగర్ కాలనీ పార్కు వద్దకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనం చేరుకుంది. వాహనానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్ఈడీ తెరపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించడంతో పాటు ఆయా పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలకు అందజేశారు. ఆయుష్మాన్ భారత్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఔషధాలు అందజేశారు. అర్హులైన వీధి వ్యాపారులకు కేంద్ర పథకాల కింద బ్యాంకులు మంజూరు చేసిన చెక్కులను కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో డీపీఓ రత్నమాల, మెడికల్ ఆఫీసర్ బ్రిజున్నీసా, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య బృందంతో నిర్వాహకులు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయి రెడ్డి తెలిపారు. కామినేని హాస్పిటల్స్ వారు ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి, జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య సిబ్బంది పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులకు పరీక్షలు చేసి వారికి పలు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి మానిక్ ప్రభు, సంచాలకుడు కాటంగురి బుచ్చి బాబు, శ్రీనాథ్, డాక్టర్ బాచిరెడ్డి శాయి రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యుడు మొలుగూరి ఫణీంద్ర భార్గవ్, పీపీ సునీత బర్ల, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 600 మందికి బీపీ, మధుమేహం, ఈసీజీ, ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

భూపేశ్‌గుప్తానగర్‌లో శోభాయాత్ర


విగ్రహాలతో శోభాయాత్రకు బయలుదేరుతున్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

హస్తినాపురం: అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన సందర్భంగా హస్తినాపురం భూపేష్‌గుప్తానగర్ కాలనీలో మంగళవారం భారీ శోభాయాత్ర నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ ఆలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను భజనలు, ఆటపాటలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దండే వినయ్ శాస్త్రి, అయ్యప్ప స్వామి సన్నిధానం వెంకటగిరిగౌడ్ గురుస్వామి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాలేరు దేవేందర్, ఎరుకల చిన్న మల్లేశ్‌గౌడ్, బబ్బూరి శారద ప్రభాకర్‌గౌడ్, విజయలక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

సైదాబాద్: సైదాబాద్ దోభీఘాట్‌లోని సనత్‌నగర్ బాయ్స్–1 తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదవ తరగతిలో ప్రవేశాలకు నిర్దేశించిన రిజర్వేషన్ల మేరకు సీట్ల కేటాయింపు చేస్తామన్నారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.